# మూగనోము

-కె.బి.కృష్ణ

"నాన్నగారూ ఎలా ఉన్నారు. ఏం చేస్తున్నారు. అమ్మనోసారి పిలవండి. మాట్లాడాలి" అంది ఫోనులో మా అమ్మాయి.

"అమ్మ అకస్మాత్తుగా మూగనోము పట్టిందిరా. అంటే అలిగింది అనుకుంటున్నావా? కాదులే ఈ మధ్యన టీవీలో స్వామీజీల ఉపన్యాసాలు తెగ చూస్తుందిలే.."

నా మాటలకు అడ్డువచ్చి "అసలు విషయం చెప్పండి" అంది విసుగ్గా.

"సుదీర్ఘకాలం భార్యా భర్తా కలిసి జీవించాలంటే ముఖ్యంగా స్త్రీ సుమంగళిగా వుండాలంటే , ఎనభై రోజులు మూగనోము పట్టాలనీ ఓ స్వామీజీ 'ఆస్థా' టీవీలో చెప్పారంటలే. అదీ సంగతి.."

"ఈ హైటెక్ యుగంలో ఈ మూగనోములేంటి నాన్నగారూ? ట్రాష్..మీరైనా అమ్మకు చెప్పద్దూ.."

"చాల్లే. నేను చెప్పే అవకాశం ఎక్కడిచ్చిందీ మీ అమ్మ. ఉన్నపళాన్న ఒక తెల్లకాగితం ముక్కమీద 'నేను మూగనోము పట్టాను ఎనభై రోజులు' అంటూ రాసి చూపించేసింది. ఆ ఎనభై రోజుల తరువాతనే కదా మేం మాట్లాడుకునేది.."

"బాగానే వుంది గోల. మీరు ఎలా కాలక్షేపం చేస్తారు" అంది అమ్మాయి.

"ఆడాళ్లు మాట్లాడితే గోల కాని లేకపోతే ఏముందీ. ఎలాగో గడుస్తున్నాయిలే రోజులు. అప్పుడే ఐదు రోజులైపోయింది" అన్నాను.

ఇంతలో..

"హలో బావగారూ ఏం చేస్తున్నారు. రేపు మీ చెల్లెమ్మ అటుగా వస్తుందట. మా సిస్టర్‌కి చెప్పండి" అంటూ మా వియ్యంకులుగారి ఫోను.

నేను వెంటనే.. "బావగారూ. మీ సిస్టర్ అనుకోకుండా రెండు మండలాలు మూగనోము పట్టేసిందండి. మా చెల్లెమ్మను రావద్దని చెప్పండి. వచ్చి ఏం మాట్లాడుకుంటారు వాళ్లు..." అన్నాను.

"సరే" అని ఫోను పెట్టేశారాయన వివరాలు అడక్కుండా.

ఇలాగే మా అబ్బాయి, కోడలు, మా బంధువర్గం ఎప్పుడూ ఫోను చేసేవాళ్లు, ఆమెకోసం ఫోను చెయ్యడం నేను మూగనోము సంగతి చెప్పడం జరుగుతోంది. వీధి తలుపు గడియ పెట్టి, ఎవ్వరైనా తలుపుకొడితే, వచ్చిందెవరో తెలుసుకుని మరీ తలుపు తీస్తున్నాను. ఇది మా శ్రీమతి ఆజ్ఞ శిరసావహించవలసిందే కదా!

ఇలా భారంగా గడుస్తున్నాయి రోజులు. మొత్తానికి డెబ్బై ఐదు రోజులు గడిచాయి.

ఓరోజు ఉదయాన్నే "ఈ రోజుతో నా మూగనోము పూర్తి అయింది. రేపటినుంచి నాకు ఫోనొస్తే ఇవ్వండి" అంది నా శ్రీమతి.

మరుక్షణంలో మా అమ్మాయికి, వాళ్లమ్మ మూగనోము విరమించినట్లుగా సిక్స్త్ సెన్స్ ద్వారా తెలిసిందో ఏమిటో, ఫోన్ చేసేసింది. తను అర్జెంట్‌గా పనిమీద వస్తున్నాననీ, తన తల్లి మూగనోము వ్యవహారం తెలుసుకుంటాననీ-




మర్నాడు వస్తూనే నన్ను చూడగానే ఎన్నేళ్లకో నన్ను చూసినట్లుగా, ముఖం చేటంత చేసుకుని, "బావున్నారా నాన్నగారూ..అమ్మేది.." అంటూ లోపలకు వెళ్లింది చక చకా.

మరుక్షణంలో తల్లీ కూతురూ బయటకు వచ్చారు నవ్వుకుంటూ.

"భలేవారే. నాన్నగారు మిమ్మల్ని కంగారు పెట్టేశారు అమ్మకు ఈ మూగనోముల పిచ్చి ఎక్కడి నుంచి వచ్చిందిరా బాబూ అని కంగారు పడిపోయానంటే నమ్మండి. ఈ మూగనోముకు ఎంత ఖర్చయిందేమిటి?"

"ఆఁ. ఎంతా.. అరవై వేలయింది సుమారుగా.." అన్నాను ఆ వెంటనే. "అయితే అయిందిగాని, అమ్మ ముఖం బలేగా కళగా వుందిప్పుడు" అంది వాళ్ళమ్మను చూసి అదోలా నవ్వుతూ.

"చాల్లేవే. పిచ్చిపిల్లా! ఈ వయసులో ఈ సోకులు ఎందుకంటే వినలా మీ నాన్నగారు. కింద నాలుగు, పైన నాలుగు పళ్లున్నాయి ఎలా బ్రతుకుతావు. మొత్తం పళ్ళన్నీ పీకించేసి కట్టించేద్దాం. ఎవరికంటా పడడానికి వీలులేదు. అంతగా ఎవ్వరైనా అడిగితే నీ పళ్లు కట్టించుకునే వరకూ మూగనోము అని చెబుతానులే..అన్నారే బాబూ. మరీ బోసినోరుతో అందరికంటా ఎలా పడాలి. అందుకని ఇలా చేశారు-" అంటున్న ఆమె నవ్వుతుంటే, ముత్యాల్లాంటి కొత్త కట్టుడు పళ్లు మిలమిలా మెరుస్తున్నాయి.

"పిల్లా ఈ విషయం ఎవరికీ చెప్పకే బాబూ" అంటూ కూతురి చెవిలో చెబుతున్న ఆమెను చూసి.

"రెండు కొప్పులకు తెలిస్తే, ఆ రహస్యం రెండు కోట్లమంది జనాభాకు తెలిసినట్లే అని ఎవరో అనగా విన్నానులే.." అన్నాను శ్రీమతిని అదోలా చూస్తూ-

"చాల్లెండి సంబడం-" అంది మూతి అష్టవంకర్లు తిప్పుతూ. నిజమే కట్టుడు పళ్లు పెట్టాక ఆమె ముఖంలో కొత్త కళ వచ్చింది సుమా!

★